క్లుప్తంగా

30న సీపీఎం మహా సభలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సీపీఎం కడప నగర మహా సభలను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ నగరంలో 130 పేదల నివసించే కాలనీలు ఉన్నాయని, ఈ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తిగా నిలిచిపోయిందని, వర్షం వస్తే ప్రధాన రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయన్నారు. నగరంలో విలీనమైన పంచాయతీలలో మౌలిక వసతులు కల్పించడంలో నగర కార్పొరేషన్ విఫలమైందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై చర్చించేందుకు విజయవాడలో ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్.గోపి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవ అమోఘమని, అయితే వేతనాలు పెంచక పోవడం మంచిది కాదని తెలిపారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న వాటర్, శానిటేషన్, ఇంజినీరింగ్ స్కిల్, సెమీ స్కిల్డ్, డ్రైవర్స్, తదితర కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు . ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మున్సిపల్ రాష్ట్ర మంత్రి వర్యులు నారాయణ, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు హాజరవుతున్నట్లు తెలిపారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని మా అమ్మఒడి అనాథ బాలల నిలయం, ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం పలువురికీ దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. శూరు లక్ష్మీనారాయణ పుట్టినరోజు సందర్భంగా ఆయన కుమారులు 90 మందికి దుస్తులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కడప సెంట్రల్ జైల్లో వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ

కడప కార్పొరేషన్, మైదుకూరు : కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మైదుకూరు మండలం, పెద్దశెట్టిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లి శివరాం, వైఎస్సార్‌సీపీ మండల నేత నేట్లపల్లె రామాంజనేయులును వైఎస్సార్ సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వారి బంధువులతో కలిసి శనివారం పరామర్శించారు. తమకు ఎలాంటి సంబంధంలేని కేసుల్లో అక్రమంగా తెదేపా నేతలు ఇరికించారని వారు రెడ్యం దృష్టికి తెచ్చారు. మీరు ధైర్యంగా ఉండాలని రెడ్యం వారికి చెప్పారు. పరామర్శించిన వారిలో శివరాం భార్య గీత సౌజన్య, రామాంజనేయులు భార్య భాగ్యజ్యోతి, కమలాపురం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆదిమూలం వెంకటశివయ్యయాదవ్, ఖాజీపేట మండల నేత మల్లె ఓబయ్యయాదవ్‌లు ఉన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు తొలి సంతకం చేసినా నోటిఫికేషన్ విడుదల కాలేదన్నారు. ఇప్పుడు కృష్ణ, గుంటూరు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌తో మళ్లీ నోటిఫికేషన్ విడుదల కాదేమో అని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు.

13న బహిరంగ వేలం



కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపో మేనేజర్ వెంకటపతి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 13న మద్యం దుకాణాల్లోని సామగ్రికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపో మేనేజర్ వెంకటపతి పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని ఐఎంఎల్ డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణంలో ఉన్న 100 ఫ్రిజ్‌లు, 104 ఇన్వర్టర్లు, 111 నగదు భద్ర పరిచే బాక్స్‌లు, 203 స్కానర్లు, 123 క్యాష్ నమోదు చేసే మిషన్లను బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.5వేల డిపాజిట్ చేయాలన్నారు. ఈ బహిరంగ వేలం ఐఎంఎఫ్ఎల్ కార్యాలయంలో ఉంటుందని మరిన్ని వివరాలకు 9949633463, 9949351042 నెంబర్లను సంప్రదించాలన్నారు.

దడ పుట్టిస్తున్న ధరలు

నిత్యావసర సరకుల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. వాటితోపాటు నూనె ధర సలసల కాగుతోంది. ఈ రెండింటి మధ్య సామాన్యుడు నలిగిపోతున్నారు. ప్రతి నిత్యం వినియోగించే ఉల్లి, వెల్లుల్లి ధర అమాంతం పెరుగుతుండటంతో జనాలు బెంబేలెత్తి పోతున్నారు. ధరను నియంత్రించాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి వ్యవహరిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చెమటలు పట్టిస్తున్న నిత్యావసర సరకులు
- అమాంతంగా పెరిగిన ఉల్లి, వెల్లుల్లి ధర
- సామాన్యులకు తప్పని అవస్థలు



కడప అగ్రికల్చర్: నిత్యావసర, కూరగాయలు ధరలు మండుతున్నాయి. సామాన్యుడు కొనలేని పరిస్థితి. రూ.500 తీసుకెళ్తే ఆరు వస్తువులు రావడం లేదు. ధరల నియంత్రణలో భాగంగా రైతు బజారులో ప్రైవేటు అసోసియేషన్ ఆధ్వర్యంలో కంది పప్పు, బియ్యం, వేరుశనగ, పాయిల్ ధరలు కాస్త తగ్గించి అమ్మేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. అవి మూన్నాళ్ల ముచ్చటగానే మారాయి. ధరలు అమాంతం పెరుగుతుండడంతో కిలో కొనే వారంతా.. అర కిలోతో సరిపెడుతున్నారు.మొన్నటి వరకు కిలో రూ.25 నుంచి రూ.30 పలికి ఉల్లి ధర ప్రస్తుతం కిలో రూ.50కి చేరింది. క్వింటా ఉల్లిగడ్డలు రూ.1000 నుంచి రూ.1500కు చేరడంతో కొనేవాళ్లు అవస్థ పడుతున్నారు. దీనికి తోడు వెల్లుల్లి ధర అమాంతం పెరిగిపోయింది. గత ఏడాది కిలో రూ.150 నుంచి రూ.200కు విక్రయించారు. మధ్య మధ్యలో రేట్లు తగ్గడంతో వీధుల వెంట కిలో రూ.120 ధరతో ఆటోలో తెల్లగడ్డలను విక్రయించారు. ఈసారి దాదాపు కిలో రూ.370 నుంచి రూ.400కు చేరింది. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఉల్లి ధర పెరిగినప్పుడు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఉల్లిగడ్డలు బాగా పండే ప్రాంతం నుంచి కొనుగోలు చేసి రైతు బజార్లలో విక్రయించింది. రాయితీపోనూ మిగిలిన ధరను ప్రభుత్వమే చెల్లించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఆ దిశగా చర్యలు లేవు.

కందిపప్పు...పెసరపప్పు కూడా..

ఉల్లి, వెల్లుల్లితోపాటు నిత్యావసర సరకులైన కందిపప్పు, పెసరపప్పు, ఎండు కొబ్బరి, ఎండు మిర్చి ధరలకు రెక్కలు వచ్చాయి. నిత్యం వినియోగించుకునే వాటి ధర పెరగడంతో సామాన్య, మధ్య తరగతి జనాలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కంది పప్పు కిలో రూ.150 నుంచి 170లకు చేరుకుంది. పెసరపప్పు కిలో రూ.125కు ఎండు కొబ్బరి కిలో రూ.210కి చేరింది. ఎండు మిర్చి ధర కిలో రూ.220 నుంచి రూ.250 వరకు ఉండడంతో ప్రజలు కొనలేని పరిస్థితి.

ధరల వివరాలు ఇలా ఉన్నాయి

సరకు పేరు (కిలో)	2023న ధరలు (రూ.లలో)	2024న ధరలు (రూ.లలో)
వెల్లుల్లి	220	370
సన్ ఫ్లవర్	110	138
పామాయిల్	88	140
కొబ్బెర	120	210
శనగబేడలు	82	105
ధనియాలు	115	120
ఆలసందలు	100	110
నువ్వులు	150	160
మినుములు	125	123
పెసలు	120	125
ఉల్లిగడ్డలు	35	55
గోధుమపండి	45	48
సజ్జలు	38	40
రాగులు	45	48

వ్యాపారం చేయడం కష్టం



నేను పానీపూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. కిలో పామాయిల్ ధర రూ.150కు చేరింది. నేను ప్రతి నెలా రూ.100 నుంచి 120 కిలోల పామాయిల్ వాడతా. ఇలా ధరలు పెరుగుతూ పోతే వ్యాపారం చేయడం కష్టమవుతోంది. మొన్నటి వరకు పానిపూరీ ప్లేట్ రూ.10కే అమ్మాం. నిత్యావసర ధరలు పెరగడంతో ప్లేట్ రూ. 20కు పెంచాం.

– మహేష్, అంగళ్ల గ్రామం

తెల్లగడ్డలంటేనే భయం వేస్తోంది



తెల్ల గడ్డలను కొనాలంటేనే భయమేస్తోంది. ఉన్నట్లుండి ధర పెరగడంతో కొనాలంటే గుండెలు గుభేల్‌మంటున్నాయి. గతేడాది కిలో రూ. 150 నుంచి రూ. 200 లోపే ధర ఉండేది. ఈ ఏడాది కిలో రూ.380 నుంచి రూ. 400 వరకు ధర ఉంది. ఇంత ధర పెట్టి తెల్లగడ్డలను కొని తినలేకున్నాం.

– రాజశేఖరరెడ్డి, వినియోగదారుడు, ఆలంఖాన్‌పల్లి

రూ.1000 తీసుకు పోయినా...



వేయి రూపాయలు తీసుకుపోయినా చేతిలోకి సరకులు రావడం లేదు. కిలో పామాయిలు, కిలో కందిపప్పు, కిలో బియ్యం, కిలో వట్టి మిరపకాయలు, పప్పులు, కొబ్బెర రావడం లేదు. ఇలా ధరలు మండిపోతుంటే సామాన్యుడు ఎలా బతుకుతాడు. ఈ ధరల నియంత్రణ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– సిలార్‌బాషా చిన్నచౌక్, కడప

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి...



నిత్యావసర సరకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. ఇలా చేస్తే సామాన్యులు బతకగలరు. లేకుంటే వారి జీవనం దుర్భరంగా మారుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి, కడప

ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం మాదే

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నాయకత్వమే ప్రభుత్వంచే గుర్తించబడిన ఏకైక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల నిజమైన సంఘమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి రఘురాంనాయుడు తెలిపారు.ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కడపజిల్లా అసోసియేట్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సుదర్శన్‌రెడ్డి, కడప నగర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణప్రసాద్, నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 10న నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో జరుగుతున్న సర్వసభ్య సమావేశానికి అధికారిత లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి, వారికి ఎలాంటి సంబంధం లేదని, రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు 2022 జూన్‌లో కేఆర్ సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అందుకు నిజమైన సంఘం తమదేనని, ఆదివారం ఏర్పాటు కాబోతున్న సమావేశానికి ఎటువంటి గుర్తింపు లేదని తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు గమనించాలని వారు కోరారు.

ఏపీజీఈఏ సమావేశంతో సంబంధం లేదు

కడప రూరల్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేరుతో కడప నగరంలో ఆదివారం నిర్వహించే సమావేశంతో తమకు సంబంధం లేదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. సంఘం నుంచి తొలగించబడిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్ రావు హాజరవుతున్న ఈ సమావేశానికి తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలో ఉద్యోగుల సమస్యలపై సమావేశంను నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ టీ విన్సెంట్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు, రాష్ట్ర నాయకులు శ్రీకాంత్‌రాజు హజరవుతారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు సమావేశాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్: న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకు శనివారం ర్యాలీ చేసి, అనంతరం మానవహారం నిర్వహించారు. అనంతరం కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ ఏటా నవంబరు 9వతేదీన న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బలహీన వర్గాలకు దేశ వ్యాప్తంగా ఎలాంటి రుసుము లేకుండా న్యాయ సేవలందించడమే న్యాయ సేవల దినోత్సవం లక్ష్యమన్నారు. న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 957 న్యాయ విజ్ఞాన సదస్సులు, 151 మందికి ఉచిత న్యాయ సహాయం, 12 కేసులు మీడియేషన్ నందు పరిష్కరించబడ్డాయన్నారు. నాలుగు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 12984 కేసులు, సుప్రీం కోర్టు ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా ఒక కేసు రాజీ కావడం జరిగిందన్నారు. షెల్టర్, ఓల్డేజ్, చిల్డ్రన్ హోంలను విజిట్ చేసి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో కొన్ని గ్రామాలను దత్తత తీసుకుని రెవెన్యూ, లేబర్, ఉమెన్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ల సహకారంతో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, అధికారులు

లింగమూర్తి మరణం ఉద్యమానికి తీరని లోటు

కడప కోటిరెడ్డిసర్కిల్: కమ్యూనిస్టు సీనియర్ నాయకులు లింగమూర్తి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు అని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు తెలిపారు. నగరంలోని స్వామి నగర్‌లో లింగమూర్తి మృతదేహాన్ని పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు సందర్శించి శనివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సంవత్సరాలకు పైగా పేదల కోసం లింగమూర్తి పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు వేణు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరం తారక రామానగర్‌కు చెందిన బాలుడు శుక్రవారం అదృశ్యమయ్యాడు. కడపలో అదృశ్యమైన బాలుడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడని మార్కులు తక్కువ వస్తుండడంతో ఇంట్లో నుండి చెప్పకుండా వెళ్లిపోయారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజ్ ఆధారంగా పరిశీలించి కలకడలో గుర్తించామని అక్కడి నుండి పిలిపించి వారి తల్లిదండ్రులకు శనివారం సాయంత్రం అప్పగించినట్లు కడప తాలూకా సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వివిధ రికార్డులను తనిఖీ చేసి, అక్కడ అందజేస్తున్న సేవలను పరిశీలించారు. రక్త పరీక్షల విభాగాన్ని, ఫార్మసీ విభాగాన్ని సందర్శించి అవసరమైన సూచనలు చేశారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించి గర్భిణులకు అందజేస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి స్థానిక వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, సిబ్బందిని అభినందించారు. కేంద్రీకృత రక్తపరీక్షల భవనాన్ని పరిశీలించారు.

జూదరుల అరెస్టు

కడప రెడ్డిసర్కిల్ : కడప నగర శివానేలోని వైఎస్ఆర్ కాలనీలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.16,500 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

జిల్లాలో ప్రతిభావంతులకు కొదవ లేదు



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్: జిల్లాలో ప్రతిభావంతులకు కొదవ లేదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. స్థానిక రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక ఎక్స్‌లెన్స్ అవార్డు సాధించిన అధ్యాపకులు బాలగొండ గంగాధర్, నాగార్జున యూనివర్సిటీ బీఓఎస్ చైర్మన్‌గా ఎంపికైన డాక్టర్ కోట మృత్యుంజయరావులను శనివారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ జిల్లా వారసత్వం, పర్యాటక, కళాభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థల సభ్యులకు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించడం గర్వకారణమన్నారు. అనంతరం అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఇంటాక్ కన్వీనర్ లయన్స్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోతుల వెంకట్రామిరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు, వెంకటేశ్, సురేష్, జోజిరెడ్డి, యల్లేశ్వరరావు, గంగాధర్, కేశవరెడ్డి, సుబోధ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో వైద్యం అందిస్తున్న డాక్టర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఫిమ్స్ సెక్రటరీ జవ్వాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు. నంది గ్రామంలోని హైస్కూల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ప్రీడియాట్రిక్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు ఫిమ్స్ ఆస్పత్రి వైద్యులు వైద్య చికిత్స చేశారు. 250 మందికి పైగా శిబిరంలో,పాల్గొన్నారు.

వేడుకగా నాగార్జున కళాశాల స్వాగతోత్సవం



మాట్లాడుతున్న డా. కె. సూర్యనారాయణరెడ్డి



సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు

వైవీయూ: కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో స్వాగతోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో దీటుగా రాణిస్తున్నారన్నారు. సంకల్పం ఉంటే రాణించలేని రంగం అంటూ ఏదీ లేదని వివరించారు. ప్రపంచంతో పోటీ పడుతూ మహిళలు అన్నింటా రాణిస్తుండటం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డా. సూర్యారావు మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థిని ఉన్నత స్థానాలకు తీసుకువెళ్తుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా జిల్లాలో విద్యాసేవలందిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా. కె. సూర్యనారాయణ రెడ్డి కళాశాల ప్రగతి నివేదికను వివరించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● నేతల హామీలు.. నీటిమూటలేనా?





అధికారంలోకి వస్తే.. అలా చేస్తాం.. ఇలా చేస్తాం అంటూ హామీలిచ్చిన నేతల మాటలు నీటిమూటలయ్యాయి. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అమలు చేస్తారని నాలుగు నెలలుగా ఎదురు చూసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం నిరాశే మిగిల్చింది. మసాపేట రహదారి ప్రక్కన కాల్వ వేశారు. ఎన్నికలు రావడంతో అసంపూర్తిగా వదిలేశారు. అప్పట్లో గ్రామానికి ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే గుడి కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకూ అటు వైపే రాని పరిస్థితి. దీనికి తోడు ఇచ్చిన వినతులకు ఆదరణ లేకుండా పోయింది. గ్రామస్తులు మాత్రం నిలిచిన నీటితో దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నారు. సాక్షి కెమెరా తీసిన చిత్రాలివీ.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

వేమన పద్య పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు : కడప రెడ్డి సేవా సమితి రజతోత్సవ వేడుక నిర్వహించడం సంతోషంగా ఉందని ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి తెలిపారు. కడప రెడ్డి సేవా సమితి రజతోత్సవ వేడుక సందర్భంగా ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో శనివారం వేమన పద్య పోటీలు నిర్వహించారు. స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజక వర్గాల పరిధిలోని 40 ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. నరాల రామారెడ్డి మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో రెడ్డి సేవా సంఘాన్ని ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ మూలె రామమునిరెడ్డి, శివప్రభాకర్‌రెడ్డి, పాలెం వేణుగోపాల్, డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ పల్లా కృష్ణ, గొర్రె వెంకటేష్ వ్యవహరించారు. వరుస విజేతలుగా నిలిచిన వై.శ్రీవాసవి, ఏవీ.కార్తిక, జి.సుమఅఖిలలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందజేశారు. 13 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలకు హాజరైన 700 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు మాధవ్ రెసిడెన్సీ యజమాని గంగిరెడ్డి మాధవరెడ్డి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కె.నాగిరెడ్డి, డాక్టర్ మద్దిక సుబ్బిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణారెడ్డి, ఎన్.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యావేత్త సుబ్బారెడ్డి మృతి

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సీవీఎన్ జసుబ్బారెడ్డి(91) స్థానిక హౌసింగ్ బోర్డులోని తన నివాసంలో శనివారం మృతి చెందారు. ఈయన రాజుపాళెం మండలం తొండలదిన్నెలో 1934 జూలై, 1న నారపురెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. ఈయన 1973 నుంచి 1989 వరకు కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల డీఈఓగా పనిచేశారు. 1982 నుంచి 1989 వరకు అడల్ట్ సెక్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా, నవోదయ జాయింట్ డైరెక్టర్‌గా, 1990 నుంచి తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి 1992లో రిటైర్డు అయ్యారు. 1992 నుంచి 1994 వరకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఢిల్లీలో పనిచేశారు. 1994లో యోగివేమన యూనివర్సిటీ సీసీ మెంబర్‌గా రెండేళ్లు కొనసాగారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితంగా ఈయన కొనసాగేవారు. ఈయన మృతదేహానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నివాళి అర్పించారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య శ్మశానవాటికలో సుబ్బారెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రోళ్లబేడు బేస్ క్యాంప్ ఆకస్మిక తనిఖీ



సిద్దవటం రేంజ్‌లో సబ్ డీఎఫ్‌ఓ వివేకానంద

సిద్దవటం: సిద్దవటం రేంజ్ రోళ్లబోడు బేస్ క్యాంపును శనివారం వైఎస్ఆర్ జిల్లా బద్వేల్ సబ్ డీఎఫ్ఓ బి. స్వామి వివేకానంద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గొల్లపల్లె ఫారెస్టు సెక్షన్ స్టాఫ్‌తో కలిసి రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం బీట్లలో ఎర్రచందనం స్మగ్లర్ల ఆచూకీ కోసం కూంబింగ్ నిర్వహించారు. అంతేగాక సిబ్బందికి ఎర్రచందనం పరిరక్షణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఎఫ్‌బీఓలు పెంచల్‌రెడ్డి, ఆది విశ్వనాథ్, మధు, రోళ్లబోడు, సిద్దవటం బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు. సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్ నిర్వహిస్తున్న సబ్ డీఎఫ్‌ఓ స్వామి వివేకానంద

మహిళకు గాయాలు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : ఊటుకూరు రింగ్ రోడ్ సర్కిల్ సమీపంలో గోపాల్ పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ వద్ద శనివారం సాయంత్రం జాతీయ రహదారిని దాటుతున్న మహిళను కడప వైపు నుంచి వేగంగా వస్తున్న బైకు ఢీకొనడంతో గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బ్లూకోల్ట్ పోలీసు వచ్చి స్థానికుల సహాయంతో గాయపడ్డ మహిళను ఆటోలో ఆసుపత్రికి తరలించి, బైకు చోదకుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడ్డ మహిళ సమీపంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన నాగమల్లమ్మగా స్థానికులు గుర్తించారు.